క్లుప్తంగా

పాముకాటుకు గురైన రైతు


ఆస్పత్రిలో రైతు శంకర్

పుంగనూరు: రైతు పాము కాటుకు గురైన సంఘటన ఆదివారం మండలంలోని చంద్రమాకులపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన రైతు శంకర్ (60) తన పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా విష సర్పం కాటేసింది. దీంతో కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌లో సమాచారం చేరవేశాడు. వారు పొలం వద్దకు వెళ్లేలోపు అస్వస్థతకు గురయ్యాడు. హుటాహుటిన అతడిని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

నేడే మాలల మహాగర్జనకు తరలిరండి


పోస్టర్లు విడుదల చేస్తున్న అశోక్ తదితరులు

పుంగనూరు: స్థానిక బీఎంఎస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించనున్న మాలల మహాగర్జనకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఆర్ అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో సంఘ ప్రతినిధులతో కలసి ఆయన పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. విభజనతో మాలల హక్కులు కోల్పోతారని ఆయన పేర్కొన్నారు.. మాల మహానాడు సభలతో ప్రభుత్వాలకు తమ ఐక్యత, నిరసనను తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సభలకు రాష్ట్ర ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులురెడ్డి, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషే జాతికి జీవధార


పోస్టర్ల ఆవిష్కరణలో రచయితల సమాఖ్య సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తెలుగుభాషే నాగరిక జాతికి జీవధార అంటూ భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షుడు మద్రిపూడి దేవేంద్రరావు అన్నారు. చిత్తూరు నగరంలోని సమాఖ్య కార్యాలయంలో తెలుగుభాష వైభవానికి తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు కృషి చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను తెలుగు భాషాభిమానులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బోధన-పాలన వ్యవహారాలలో తెలుగుభాషకు గౌరవం కల్పించి, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు ఆ ఒరవడే కల్పిస్తే భాషకు పూర్వ వైభవం లభిస్తుందన్నారు. మాతృభాషకై ఉద్యోగ భద్రత కల్పిస్తున్న తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రను తెలుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు తెలుగు మాధ్యమాన్ని నిర్బంధంగా కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాషాభిమానులు కోటీశ్వర మొదలియార్, మునీంద్ర, ఆనందనాయుడు, మొహిద్దీన్ అలీ, ఎం.జె.భాస్కర్ రెడ్డి, షణ్ముగం, భూపతి, డి.రోహిత్, ముబారక్, టి.మంజులాదేవి, నాగరాజ, ప్రవళ్లిక, శావంత్, భువన్ చంద్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని



ఐరాలలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఐరాల: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ఎంతో హానికరమని తిరుపతి ఎస్‌వీ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో ఆదివారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో 'సే నో టు ప్లాస్టిక్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎస్‌వీ వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ వై.రెడ్డి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా రెడ్డిరాము మాట్లాడుతూ ప్రజలు వాడే ప్లాస్టిక్ కారణంగా జీవరాశికి ప్రమాదం ఏర్పడుతోందన్నారు. ప్లాస్టిక్ భూమిలో కలవకపోవడంతో పర్యావరణ దెబ్బతింటుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగించడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవాళి భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్నారు. పార్థీనియం మొక్క నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో కాలుష్య నివారణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ, బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఆంధ్రా భూములపై తమిళ గద్దలు

కుప్పం నియోజకవర్గంలో తామేమీ తీసిపోమనే లెవెల్లో తమిళ తంబీలు సైతం కబ్జాలకు తెగబడుతున్నారు. కుప్పం ఇటు తమిళనాడు, అటు కర్ణాటకలకు సరిహద్దులుగా ఉన్న మూడు రాష్ట్రాల కూడలి ప్రదేశం. మండలం ఎక్కువ భాగం తమిళనాడుకు సరిహద్దుగా ఉంది. దీన్ని అవకాశంగా చేసుకుని తమిళనాడు వాసులు స్థానికుల సహకారంతో ఆంధ్ర భూములను కబ్జా చేస్తూ ఇక్కడ పాగా వేస్తున్నారు. తమిళ తంబీల కబ్జాల పర్వానికి అధికార పార్టీ రాష్ట్ర స్థాయి నాయకుడి అండదండలు, సహకారం లభిస్తుండడంతో తంబీలు ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండాపోతోంది. ఇంతజరుగుతున్నా రెవెన్యూ అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్టు చేష్టలుడిగి చోద్యం చూస్తోంది.

- తమిళులకు సహకరిస్తున్న అధికార పార్టీ నాయకుడు
- తాజాగా 1.7 ఎకరాల విలువైన భూమి అన్యాక్రాంతం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం


కబ్జాకు గురైన భూమి

కుప్పం రూరల్: తమిళనాడు వాసులకు అక్కడ సారవంతమైన భూములు లేకపోవడం, విద్యుత్ సర్వీసులు సకాలంలో మంజూరు కాకపోవడంతో బడా బాబులు ఆంధ్ర ప్రాంతాల్లో పాగాకు యత్నిస్తున్నారు. కుప్పం మండలంలోని అటవీ ప్రాంతాలైన పెద్దవంక, బ్రహ్మదేవర చేన్లు పంచాయతీలు తమిళనాడుకు సరిహద్దులుగా ఉన్నాయి. ఇక్కడ భూములు సారవంతంగా ఉండడంతో తమిళనాడు వాసులు అక్రమ మార్గాల్లో ఆంధ్రలో చొరబడేందుకు యత్నిస్తున్నారు. తాగా, పెద్దవంక గ్రామ సమీపాన ఉన్న ఆర్ ఎఫ్ సర్వే నంబర్ 57లోని 1.7 ఎకరాల విలువైన భూమిపై తమిళ తంబీ కన్నుపడింది. ఈ ఏడాది ఆగస్టులోనే కబ్జాకు యత్నించగా అప్పటి వీఆర్వో అడ్డుకున్నారు. 'ఇది ప్రభుత్వ భూమి..ప్రవేశించినచో శిక్షార్హులు' అని హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేశారు. దీంతో మూడు నెలల పాటు వ్యూహాత్మకంగా మౌనం పాటించిన ఆ తమిళ తంబీ మరలా ఇప్పుడు ఆ భూమిని యంత్రాలతో చదును చేసి కొబ్బరి చెట్లు నాటేందుకు ఉపక్రమించాడు. ఈ పర్యాయం పక్కాగా స్కెచ్ వేసి, క్షేత్రస్థాయి రెవెన్యూ యంత్రాంగంపై అధికార పార్టీ నాయకుల చేత ఒత్తిళ్లు తేవడంతో ఆక్రమణకు లైన్ క్లియర్ అయినట్లైంది! దీంతో విలువైన 1.7 ఎకరాల స్థలం తమిళ తంబీ పరమైంది. ఇది మచ్చుకు ఒకటి మాత్రమే. ఇలాంటి దురాక్రమణలు ఇక్కడ కోకొల్లలు.

జగనన్న కాలనీకి గుర్తించిన అప్పటి ప్రభుత్వం

పెద్దవంక సమీపంలో రోడ్డుకు ఆనుకున్న ఉన్న విలువైన స్థలం కావడంతో గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేసింది. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఆలోచన కాస్త పెండింగ్‌లో పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ స్థలంపై ఎప్పటి నుంచో కన్నేసిన తమిళ తంబీ రాష్ట్రస్థాయి అధికార పార్టీ నాయకుడి అండదండలు ఉన్న ఓ చోటా నాయకుడి సహకారంతో పాగాకు ప్రయత్నించాడు. గ్రామస్తులు అడ్డుపడితే ఆ నాయకుడితో బెదిరింపులకు తెగబడ్డాడు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో ఆ భూమిని కబ్జా చేసి కొబ్బరిచెట్లు నాటే పనిలో పడ్డాడు.

పట్టించుకోని అధికార యంత్రాంగం

జనావాసాల మధ్య రోడ్డు పక్కనే విలువైన 1.7 ఎకరాల స్థలం అన్యాక్రాంతమవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమది పారదర్శక ప్రభుత్వమని, కబ్జాలను ఉపేక్షించేది లేదని ఇటీవల ఆర్భాటంగా ప్రకటించారు. సాక్షాత్తు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటోంది. విలువైన ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం ఉదాసీనంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రభుత్వ భూమంటూ ఆగస్టులో వీఆర్వో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నియామకం


మునీంద్ర నాయక్

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్టలో నివాసం ఉన్న డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు పంపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో చర్చించి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని మునీంద్ర నాయక్ తెలిపారు.

అంధకారంలో కీలపట్ల కొలింపాళ్యం వీధి

- వారం రోజులుగా వెలగని వీధి లైట్లు

గంగవరం: ''సర్పంచ్ గారూ.. పంచాయతీలో ఏదో అన్ని పనులూ చేస్తున్నట్టు ఫొటోలకు ఫోజులిచ్చి ఆ ఫొటోలను సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడం కాదు.. పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టండి.. శ్రీ కోనేటిరాయస్వామి వెలసిన కీలపట్లలోని కొలింపాళ్యం వీధిలో వారం రోజులుగా వీధి లైట్లు వెలగక అంధకారంలో మగ్గుతున్నా పట్టించుకోరా!?'' అని సర్పంచ్‌పై గ్రామస్తులు మండిపడుతున్నారు. మరోవైపు ట్రాన్స్‌కో అధికారుల తీరుపై కూడా ఎండగడుతున్నారు. వారం రోజులుగా గ్రామ వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకూ అతీగతీ లేదని వాపోతున్నారు. ఇకనైనా అంధకారంలో మగ్గకుండా చూడాలని కోరుతున్నారు.

చిన్నారుల నూతనోత్సాహం..!







పుంగనూరులో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

పుంగనూరు: చిన్నారుల చిందులు, విచిత్ర వేషధారణలతో నూతన సంవత్సరానికి బాలబాలికలు స్వాగతం పలుకుతూ పాత సంవత్సరానికి వీడ్కోలు పలికారు. ఆదివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఫెస్టివల్ పేరిట 85 రకాల ఈవెంట్‌లను అట్టహాసంగా నిర్వహించారు. విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద నృత్యాలతో పట్టణ ప్రజలను బాలబాలికలు ఆకట్టుకున్నారు. గెలుపొందిన చిన్నారులకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బహుమతులు పంపిణీ చేశారు. ప్రతి ఏటా లయన్స్ క్లబ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పరిపాటి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ, క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ మనిషికి రక్షణ కవచం

తవణంపల్లె: రక్షణ కవచంలాంటి హెల్మెట్‌ను ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు ధరించాలని తవణంపల్లె హెచ్‌సీ గజేంద్ర తెలిపారు. ఆదివారం సాయంత్రం తవణంపల్లెలో ద్విచక్రం వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడంతో జరిగే ప్రమాదాల్లో నిండు ప్రాణాలు క్షణంలో గాలిలో కలుస్తున్నాయని వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు చేపట్టడంతో పాటు జైలుకు పంపుతామని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనం దారులు హెల్మెట్ తప్పక వాడాలని లేనిచో అపరాధం విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్లు విడుదల


యూటీఎఫ్ సభల పోస్టర్లను విడుదల చేస్తున్న అసోసియేషన్ నాయకులు



ప్రచార జాతలో యూటీఎఫ్ నాయకులు

పుంగనూరు: జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించ తలపెట్టిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం దీనికి సంబంధించి పోస్టర్లను విడుదల చేసి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ మాట్లాడారు. మహాసభలకు ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి హాజరవుతారని తెలిపారు. సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, 117 జీవో రద్దు, సీపీఎస్ రద్దు, విద్యారంగం బలోపేతం, వివిధ అంశాలపై మహాసభలో చర్చించి, తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సోమశేఖర్‌నాయుడు, మణి, జగన్‌మోహన్‌రెడ్డి, ఈశ్వర్, మహేంద్ర, పార్థసారథి, బాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమారి, గాయత్రి, స్రవంతి, కవిత, వహిదా రేహ్మాన్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని ఆ అసోసియేషన్ నాయకులు రమణ, సోమశేఖర్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్వర్ణోత్సవ మహాసభల ప్రచార జాత ఆదివారం పలమనేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు యమపాశంలా మారిన జీఓ నంబరు 117ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు


రాయలపేట పరిసరాల్లో దట్టంగా కురుస్తున్న పొగమంచు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట పరిసర ప్రాంతాలలో ఆదివారం ఉదయం దట్టంగా పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకూ మంచు తెరలు వీడలేదు. దట్టంగా మంచు కురవడంతో వాహనచోదకులు, కూలీ పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు.

బంగారు గొలుసుల అపహరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. గంగాధర నెల్లూరు మండలం కొత్రకోన గ్రామానికి చెందిన హంసవేణి తన చెల్లెలితో కలిసి బైక్‌పై ఆదివారం దొడ్డిపల్లె వైపు వస్తుండగా.. ఓ బైకులో వచ్చిన ముగ్గురు యువకులు, చిత్తూరుకు ఎటువైపు వెళ్లాలని వారిని అడిగారు. ఆమె అడ్రస్ చెబుతుండగానే వెనుక కూర్చున్న మరో ఇద్దరు వ్యక్తులు ఆ మహిళల మెడలో ఉన్న బంగారు గొలుసులను లాక్కుని పారిపోయారు. సుమారు 62 గ్రాముల రెండు బంగారు గొలుసులు అపహరించుకుని వెళ్లడంపై బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు.

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకామాక్షీ సమేత స్వయంభు మొగిలీశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం రాహు కాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల మధ్య రాహుకేతు, సర్ప దోషనివారణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఆలయంలో రాహుకేతు పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని దోష నివారణ చేసుకోవాలని కోరారు.

కొత్త ఆలోచనలతో ముందడుగు వేయాలి


చీరలు పంపిణీ చేస్తున్న చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందడుగు వేయాలని వైఎస్‌ఆర్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డి అన్నారు. క్రిస్మస్, కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం చెన్నమ్మగుడిపల్లిలోని చర్చిలో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త సంవత్సంలో అందరికీ మంచి జరగాలని దేవున్ని ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు ప్రసాద్, జాషువా, ధనరాజ్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి


మాట్లాడుతున్న మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

చౌడేపల్లె: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిచ్చి జీవనోపాధి కల్పించడానికి కృషి చేయాలని జిల్లా మత్స్యకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండు చేశారు. ఆదివారం కాటిపేరిలో బెస్త కులస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో నూతన మత్స్యకారుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. కాటిపేరికి చెందిన నవీన్‌కుమార్ సంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ, జిల్లా మత్స్యకార సహకార సంఘంలో 18నుంచి 45 ఏళ్లలోపు ఉన్నవారు సభ్యులుగా చేరాలన్నారు. కుల వృత్తిని ప్రభుత్వం ప్రోత్సహించి చెరువుల్లో చేపలు పెంచుకునే హక్కును కల్పించి ప్రోత్సహించాలని, ఆ దిశగా ఆ శాఖ కమిషనర్, జిల్లాకలెక్టర్లు ఆదేశాలివ్వాలన్నారు. గ్రామాల్లో అర్హులైన వారు సంఘాల్లో సభ్యులుగా చేరి ఆర్థిక ప్రోత్సాహంతోపాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా సంఘాలు ఏర్పాటుచేసి అర్హులకు లబ్ధి చేకూరేలా చైతన్యం కల్పిస్తామన్నారు. సమావేశంలో బెస్త సంఘం మండలాధ్యక్షుడు కృష్ణప్ప, నాయకులు కేవీ.ఆనంద్‌కుమార్, వెంకట్రమణ, ప్రభాకర్, రవికుమార్, జ్యోతికుమార్ పాల్గొన్నారు.

అగ్రహారంలో వేడుకగా పటం పూజ


ఎస్.అగ్రహారంలో పూజలు చేస్తున్న గోవిందమాల భక్తులు

చౌడేపల్లె: మండలంలోని ఎస్.అగ్రహారంలో గోవిందమాల ధరించిన భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పటం పూజ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ రుక్మిణీ సమేత సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనందాచార్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులు, గోవిందమాల భక్తులు, మహిళలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణలతో పరిసర ప్రాంతం మార్మోగింది. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

మొరం పెద్ద చెరువులో మళ్లీ ఇసుక తవ్వకాలు!


మొరం పెద్ద చెరువులో ఇసుకను తోడుతున్న దృశ్యం

- నెలగా చెరువులోకి ఇసుకాసురులను రానివ్వని గ్రామస్తులు
- మళ్లీ కూటమి అధికార దర్పంతో చెరువులో ఇసుక తవ్వకాలకు దిగిన వైనం

పలమనేరు: మండలంలో మొరం గ్రామంలోని పెద్ద చెరువులో ఇసుక తవ్వకాలు మొదలయ్యాయి. ఈ చెరువును స్థానిక కూటమి నేతలు భాగాలు పెట్టుకుని మరీ ఇసుకను కర్ణాటకకు తరలించిన విషయం తెలిసిందే. దీనిపై మండిపడిన గ్రామస్తులు చెరువులో కూటమి నేతల ట్రాక్టర్లను అడ్డుకుని నెల రోజులుగా చెరువులోకి ఎవరినీ రానివ్వకుండా కట్టడి చేశారు. దీంతో ఇసుకాసురులకు, ఆ గ్రామస్తులకు ఇప్పటి వరకూ పెద్ద గొడవలే సాగాయి. ఈ నేపథ్యంలో అదే కూటమికి చెందిన నాయకులు ఆదివారం చెరువులో ఇసుకను తోడడం మొదలు పెట్టారు. తమ చెరువును ఇప్పటికే భ్రష్టు పట్టించిన ఇసుకాసురులు అధికార పార్టీ నేతల అండతోనే మళ్లీ చెరువులోకి వచ్చారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి మొరం పెద్దచెరువులో ఇసుకను తోడకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.